

రీఫిల్లింగ్ చేస్తే కఠిన చర్యలు

కైలాస్‌నగర్: ఎల్పీజీ రీఫిల్లింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి వాజిద్ అలీ హెచ్చరించారు. ఎల్పీజీని ఆటోల్లో నింపుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఓ మెకానిక్ షాప్‌ను తనిఖీ చేశారు.

రేపటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 24న రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నందున అర్జీల స్వీకరణను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/17.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా కనిపిస్తుంది.

కదిలిన యంత్రాంగం

- అక్రమాలపై గొంతెత్తిన 'సాక్షి'
- స్పందించిన అధికార ఘనం

సాక్షి ఎఫెక్ట్..



పలుశాఖల్లో చోటు చేసుకున్న అక్రమాలపై 'సాక్షి' అక్షర రూపేణ గొంతెత్తింది. ప్రత్యేక కథనాల ద్వారా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వ్యవసాయ శాఖలో చోటు చేసుకున్న పలు ఘటనలపై జిల్లా బాస్ సీరియస్ అయ్యారు. ఒకరిపై వేటు కూడా వేశారు. ఇక ఇసుక అక్రమ తరలింపు వ్యవహారంలో మౌనంగా ఉన్న మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయికి కదిలేలా 'సాక్షి' తీసుకున్న చొరవను పలువురు అభినందించారు.

ఇచ్చోడ వ్యవసాయాధికారిపై సస్పెన్షన్ వేటు

- కొరడా ఝుళిపించిన కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయశాఖలో చోటు చేసుకున్న అక్రమాలపై కలెక్టర్ రాజర్షి షా సీరియస్ అయ్యారు. 'సాక్షి'లో ఈ నెల 14న 'తిలా పాపం.. తలా పిడికెడు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఇచ్చోడ వ్యవసాయ శాఖలో అక్రమాలపై విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానంద్ ఇటీవల విచారణ చేపట్టారు. అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. అందులో పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్, ధ్రువీకరణ పత్రాల జారీలో అక్రమాలను తేల్చారు. ఇచ్చోడ ఏవో జాదవ్ కైలాస్ ఇష్టారీతిన టెంపరరీ రిజిస్ట్రేషన్లు జారీ చేయడంపై కలెక్టర్ కొరడా ఝుళిపించారు. సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం వ్యవసాయశాఖలో చర్చనీయాంశంగా మారింది. మిగతా అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. జిల్లాలోని ఆయా వ్యవసాయశాఖ కార్యాలయాల్లో తనిఖీలు చేపడితే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



జిల్లా వ్యవసాయాధికారి జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వు ప్రతి

క్షేత్రస్థాయికి మైనింగ్ అధికారి

- 104 ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

ఆదిలాబాద్‌టౌన్: పెన్‌గంగ నుంచి ఇసుక అక్రమ రవాణాపై 'సాక్షి' వరుస కథనాల కు జిల్లా మైనింగ్ అధికారి రవీందర్ ఎట్టకేలకు స్పందించారు. నది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్న తీరుపై ఈ నెల 17న 'తోడేస్తున్నారు' శీర్షికన, ఈ నెల 20న 'క్షేత్రస్థాయికి వెళ్లరు... స్పందించరు' శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు స్పందించిన సదరు అధికారి శనివారం బేల మండలంలోని కాంగర్‌పూర్, జైనథ్ మండలంలోని సాంగ్వీతో పాటు పలు ఇసుక ప్రాంతాలను పరిశీలించారు. కాంగర్‌పూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 104 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. కాగా, వారం రోజుల్లో పోలీసులు 13 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి రూ.85వేల జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారి

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన కోనప్ప



సీఎం రేవంత్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కోనప్ప, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్‌లో సీఎంతో భేటీ అయ్యారు. సిర్పూర్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులు రద్దు చేయడం, స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని కోనప్ప ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని కాదని బీఎస్పీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. కాగజ్‌నగర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరైన సమావేశానికి దూరంగా ఉండడంతో కోనప్ప కాంగ్రెస్‌ను వీడుతారనే సంకేతాలు వెళ్లాయి. సీఎంను కలిసిన తర్వాత పార్టీలోనే కొనసాగేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నియోజకవర్గ అభివృద్ధి పనుల పెండింగ్‌పై సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు సమాచారం.

భగీరథ ఎస్ఈగా శ్రావణ్‌కుమార్ బాధ్యతలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా బి.శ్రావణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ఈఎన్సీ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న ఈయనకు ఎస్ఈగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇక్కడకు బదిలీ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇదివరకు ఎస్ఈగా పనిచేసిన సురేశ్ సీఈగా పదోన్నతిపై వెళ్లడంతో నెల రోజులుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. అనంతరం ఆయన కార్యాలయంలోని మిషన్ భగీరథ నీటి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, నీటి నాణ్యతపై ఆరాతీశారు. అంతకుముందు కలెక్టర్ రాజర్షిషాను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యాసంస్థలకు రేపు సెలవు

కైలాస్‌నగర్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఈనెల 24న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి బదులుగా ఏప్రిల్ 12న రెండో శనివారం విద్యాసంస్థలను యథావిధిగా నిర్వహించాలని అందులో పేర్కొన్నారు.

ఇచ్చోడ డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెన్షన్

ఇచ్చోడ: టైగర్‌జోన్ ఇచ్చోడ డిప్యూటీ రేంజ్ అధికారి గీరయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. గతేడాది ఆగస్టులో సిరికొండ మండలంలో అక్రమంగా దాచి ఉన్న రూ.40వేల విలువ గల కలపను అటవీ సిబ్బంది పట్టుకున్నారు. అయితే పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేయకపోవడంతో పాటు కలపను టింబర్ డిపోకు తరలించలేదు. ఈ విషయమై అందిన ఫిర్యాదు మేరకు ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర విచారణ చేపట్టారు. బీట్ అధికారి ఖలీందర్‌పై గీరయ్య ఒత్తిడి చేసినట్లు తేలడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎఫ్‌డీవో వెల్లడించారు.



తుది అంకానికి.. సమరం

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి రాష్ట్ర నేతలు
- నేడు ఆదిలాబాద్‌కు కిషన్‌రెడ్డి.. రేపు నిర్మల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి
- హోరెత్తుతున్న అభ్యర్థుల ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల వివరాలు..
నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జిల్లాలు : 15
పట్టభద్రుల బరిలో నిలిచిన అభ్యర్థులు : 56
టీచర్స్ బరిలో ఉన్న అభ్యర్థులు : 15
పట్టభద్రుల ఓటర్లు : 3,55,159
టీచర్స్ ఓటర్లు : 27,088

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల వివరాలు

జిల్లా	పట్టభద్రులు	టీచర్లు
కుమురంభీం	6,137	470
మంచిర్యాల	30,921	1,664
ఆదిలాబాద్	14,935	1,593
నిర్మల్	17,141	1,966

సాక్షి, ఆదిలాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. ఆయా పార్టీల రాష్ట్ర నేతలు రానుండటం ప్రచారపర్వాన్ని హీటెక్కిస్తోంది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శనివారం నిర్మల్ జిల్లాలో పర్యటించగా.. ఆదివారం ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నిర్మల్‌కు రానున్నారు. అక్కడ ఉమ్మడి జిల్లా పట్టభద్రులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొననున్నారు. మరోవైపు పట్టభద్రుల ఓటర్లు అధికంగా ఉండటంతో అభ్యర్థులు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నా రు. ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఇక టీచర్స్ ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో ఆయా అభ్యర్థులు ఉపాధ్యాయ సంఘాల ద్వారా ప్రచారపర్వం కొనసాగిస్తున్నారు. వారి పర్యటనలు అంతగా లేవు.

అభ్యర్థుల విస్తృత ప్రచారం..

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారవేడి ఊపందుకుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కాగా, కరీంనగర్ కేంద్రంగా అభ్యర్థులు పదో తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన, ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ నెల 25తో ప్రచారపర్వం ముగియనుంది. 27న పోలింగ్ ఉంటుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పలువురు అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక టీచర్స్ ఎమ్మెల్సీ పరంగా బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, టీఎఫ్‌టీఎస్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ సంఘాల నుంచి అశోక్‌కుమార్, ఎస్టీయూ, మోడల్‌స్కూల్, కేజీబీవీ, సీపీఎస్ సంఘాల మద్దతుతో మరోసారి బరిలో నిలిచిన ప్రస్తుత ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మధ్య పోటీ నెలకొంది.

మందు, విందుల జోరు..

పట్టభద్రుల అభ్యర్థులు ఇటు ప్రచార పర్వంతో పాటు అటు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మందు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు సంఘాల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇక డబ్బుల పంపిణీపై అభ్యర్థులు దృష్టి పెట్టారు. ప్రధానంగా ఓటుకు కనిష్ఠంగా రూ.2వేల నుంచి గరిష్టంగా రూ.10వేల వర కు అందజేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

గత ఫలితాలు ఇలా...

ఈ నియోజకవర్గంలోని ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం మార్చిలో పూర్తి కానుంది. ఈ ఎన్నికల ద్వారా కొత్త ఎమ్మెల్సీలు రానున్నారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌పై 39,430 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి సుగుణాకర్‌రావు మూడో స్థానంలో నిలిచారు. నాడు జీవన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓట్ల ద్వారా గెలుపొందారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి పోటీ చేసిన రఘోత్తంరెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థి మోహన్‌రెడ్డిపై 1707ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

మళ్లిస్తున్నా.. మౌనమేలా!

- ఆదిలాబాద్ తాగునీరు నిర్మల్‌కు మళ్లింపు
- జిల్లాలో ఇప్పటికే మొదలైన తాగునీటి సమస్య
- ఎండల తీవ్రత పెరిగేకొద్దీ మరింత జఠిలం

జిల్లాలో..
మిషన్ భగీరథ నీటిపై ఆధారపడ్డ జనాభా : 7,31,875
ఆదిలాబాద్ మున్సిపల్ వార్డులు : 45
మొత్తం నివాసిత ప్రాంతాలు : 746
రక్షిత మంచినీటి పథకాలు : 983

కైలాస్‌నగర్: జిల్లాకు రావాల్సిన మిషన్ భగీరథ నీటిని మరో జిల్లాకు మళ్లిస్తున్నారు. మాటేగాం ఫిల్టర్‌బెడ్ నుంచి ఆదిలాబాద్‌కు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌కు పలుచోట్ల అక్రమ కనెక్షన్లు ఏర్పాటు చేసి నిర్మల్‌కు తరలిస్తున్నారు. దీంతో సరిపడా నీరు రాక జిల్లాలోని పలు ఆవాస ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి మొదలైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిపుత్రులు గొంతు తడుపుకునేందుకు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. కాలినడకన కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఎండల తీవ్రత పెరిగే కొద్దీ సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉంది. మూడేళ్లుగా నీటిని మళ్లిస్తున్నా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మౌనం వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి అవసరమైన మిషన్ భగీరథ నీటిని నిర్మల్ జిల్లా నుంచే సరఫరా చేస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి గోదావరి నీటిని అందించేందు కోసం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాటేగాం వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. అక్కడి నుంచి జిల్లాకు నీటి సరఫరా చేస్తున్నారు. ఆదిలాబాద్‌కు ప్రతిరోజు 84 ఎంఎల్‌డీల నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే జిల్లాకు పూర్తిస్థాయిలో అవసరమైన నీటిని అందిస్తున్నామని భగీరథ అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. పైపులైన్లు, వాల్వ్‌ల లీకేజీ కారణంగా నిత్యం వేలాది లీటర్ల నీరు వృథాగా పోతోంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ప్రతిరోజు 28 ఎంఎల్‌డీల నీరు సరఫరా కావాల్సి ఉండగా 18ఎంఎల్‌డీలు కూడా రావడం లేదని బల్దియా అధికారులు చెబుతున్నారు. దీంతో మున్సిపల్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సమస్య తలెత్తుతోంది.

నీటి మళ్లింపు ఇలా..

ఆదిలాబాద్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు పలుచోట్ల అక్రమ కనెక్షన్లు ఏర్పాటు చేసి నీటిని నిర్మల్‌కు తరలిస్తున్నారు. మాటేగాం వద్ద నుంచి నిర్మల్ మండలంలోని తల్వేదచౌక్, యల్లపల్లి, నీలాయిపేట గ్రామాలతో పాటు నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఎయిర్ వాల్వ్‌కు ప్రత్యేక కనెక్షన్ ఏర్పాటు చేసి చుట్టుపక్కల గ్రామాలకు మళ్లిస్తున్నారు. ఇలా జిల్లాకు సరఫరా కావాల్సిన నీటిని నిర్మల్‌కు నిత్యం 18 ఎంఎల్‌డీల వరకు తరలిస్తున్నారని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. నిర్మల్ జిల్లా కు నీటిని అందించేందుకు ప్రత్యేక పైపులైన్ వేసి 2018 వరకు వాటి ద్వారానే నీటిని అందించారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా జిల్లాకు వచ్చే పైపులైన్‌పై అక్రమ కనెక్షన్లు ఏర్పాటు చేసి నీటిని మళ్లిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా జిల్లాలోని నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్ రూరల్, తాంసి, తలమడుగు మండలాల్లోని సుమారు 54 ఆవాస ప్రాంతాలకు సమస్య తలెత్తే అవకాశమున్నట్లు పేర్కొంటున్నారు. మూడేళ్లుగా ఇలా నీటి మళ్లింపు జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు రావాల్సిన నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేసి తమ గొంతెండకుండా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.



నిర్మల్‌లోని మంచిర్యాల చౌరస్తా వద్ద జిల్లాకు వచ్చే పైపులైన్‌పై ఏర్పాటు చేసిన ప్రత్యేక కనెక్షన్

అక్రమ కనెక్షన్లు వాస్తవమే..

జిల్లాకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌కు అక్రమ కనెక్షన్లు ఉన్నమాట వాస్తవమే. వీటి ద్వారా నీటి సరఫరాలో ప్రెషర్ తగ్గి కొంత ఆ టంకం ఏర్పడుతుంది. పలు హ్యాబిటేషన్లకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– గోపిచంద్, వాటర్‌గ్రిడ్ ఈఈ

జిల్లాకు అవసరమైన నీటిని ఇస్తున్నాం

ఆదిలాబాద్ జిల్లాకు అవసరమైన మిషన్ భగీరథ తాగునీటిని పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. నిత్యం 84 ఎంఎల్‌డీల నీటిని అందించాల్సి ఉంది. అయితే లీకేజీలతో కొంత నీరు వృథాగా పోతుంది. అయినా ప్రజలకు సమస్య తలెత్తకుండా అదనంగా 8 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నాం. మాకు ఉమ్మడి పరిధిలోని నాలుగు జిల్లాల ప్రజల దాహార్తి తీర్చడమే ముఖ్యం. ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–జ్ఞానకుమార్, మిషన్ భగీరథ సీఈ

ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో విద్యుత్, మున్సిపల్, వైద్య, మిషన్ భగీరథ శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఉట్నూర్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలోని డీజీ సెట్ మరమ్మతు చేయించాలని సూచించారు. నీటి సరఫరా విషయంలో ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, ఆదిలాబాద్ రూరల్ , ఇంద్రవెల్లి, సిరికొండ, ఉట్నూర్ ప్రాంతాలు రెడ్ జోన్లో ఉన్నాయని అక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వాటర్ గ్రిడ్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అలాగే ఆదిలాబాద్ రూరల్ , ఇచ్చోడ డబుల్ డెడికేటెడ్ లైన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందులో విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్. చౌహాన్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాలి

యువతకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'మై భారత్ పోర్టల్‌లో ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాం' ప్రారంభించినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం తన కార్యాలయ చాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతకు మై భారత్ ప్లాట్‌ఫాం ద్వారా పరిశ్రమలపై ఆచరణాత్మక జ్ఞానం అందించాలని నిర్ణయించిందన్నారు.15 నుంచి 29 ఏళ్లలోపు వారిని లబ్ధిదారులుగా గుర్తించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీని నియమించినట్లు తెలిపారు. ఆసక్తి గల యువత ఎంవై భారత్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, నెహ్రూ యువ కేంద్ర అధికారి సునీల్ బడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్ రెడ్డి



మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు నాణేనుకున్న బొమ్మా బొరుసు లాంటివన్నారు. కాంగ్రెస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే బీజేపీతో లోపాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉందని విమర్శించారు. 14 నెలల పాలనలోనే రాష్ట్ర ప్రభుత్వం ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఉట్కూరి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఇందులో మాజీ ఎంపీ సోయం బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, నాయకులు గణేశ్‌రెడ్డి, లోక ప్రవీణ్‌రెడ్డి, జహీర్ రంజానీ తదితరులు పాల్గొన్నారు.

బేలలో..

బేల: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వ్యవహరించాల్సిన తీరుపై మండలకేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో కాంగ్రెస్ శ్రేణులకు రమేశ్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఇందులో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటస్థావరంపై దాడి

ఆసిఫాబాద్అర్బన్/లింగాపూర్: జిల్లాలోని సిర్పూర్(యూ)పోలీసుస్టేషన్ పరిధిలోని దేవుడుగూడ శివారులో అందిన సమాచారంతో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పేకాటస్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలను సీజ్ చేశారు. పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీసు సిబ్బందికి ఎస్పీ డీవీ. శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

రైల్వే సమస్యలపై ఎంపీకి వినతి



వంశీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు పుర ప్రజలు, కాంగ్రెస్, ప్రజా సంఘాల శ్రేణులు రైల్వే సమస్యలపై పెద్ద ఎత్తున విన్నవించారు. శనివారం ఆయన బెల్లంపల్లిలో పర్యటించారు. బెల్లంపల్లి శివారు కన్నాల జాతీయ రహదారి జంక్షన్‌ను పరిశీలించారు. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని పలువురు విన్నవించారు. హైదరాబాద్–న్యూఢిల్లీ మార్గంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మునిమంద స్వరూప, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మునిమంద రమేష్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, బి.రాజేశ్వర్, చంద్రశేఖర్, మధు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా..

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో ఇటీవల ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం బాధిత కుటుంబం ఇడిగిరాల భీమయ్య కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆస్తి నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగతి సత్తయ్య, నాయకులు రమేష్, మల్లేష్, హరికృష్ణ,కిరణ్, రాజన్న, వెంకటస్వామి, సుధాకర్, రఘు, రవి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లిలో ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. తాండూర్ గ్రామానికి చెందిన పబ్బని నాగయ్య(49) కొండగట్టుకు వెళ్లి తిరిగివస్తున్నాడు. శుక్రవారం రాత్రి కావడంతో వేంపల్లి గ్రామంలో పెద్ద కుమారుడు రాజశేఖర్ ఇంటికి వచ్చి అక్కడే నిద్రపోయాడు. శనివారం ఉదయం 9:30 గంటలకు ఒక్కసారిగా నాగయ్య నురుగులు కక్కుతూ కిందపడగా కుమారుడు, కుటుంబీకులు గమనించి 108 సిబ్బందికి సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి మృతికి కారణాలు తెలియరాలేదు. పెద్ద కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు



పుస్తకరాజం

- 'ఆధునికం'లోనూ వన్నె తగ్గని బుక్
- పుస్తకాలకు తరగని ఆదరణ

ఆదిలాబాద్: నేడు శాస్త్ర సాంకేతికతతో ప్రపంచం ఓ కుగ్రామం అయిపోయింది. ప్రస్తుతం అరచేతిలోనే మొబైల్‌లో క్లిక్ చేస్తే ప్రతీ సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. అయితే మనిషి స్వీయ ఆలోచనలకు ఆటంకం అవుతుంది. సొంతంగా, సృజనాత్మకంగా ఆలోచించకుండా మొబైల్‌పై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అయితే మొబైల్ ఫోన్లు లేని కాలంలో ప్రతీ విషయానికి పుస్తకమే దారి దీపం. చిన్నారుల పాఠాలు మొదలు శాస్త్రవేత్తలకు కావాల్సిన సమాధానాలు వరకు అవి దారిచూపేవి. పుస్తకం హస్తభూషణం అనేవారు అయితే ప్రస్తుతం సెల్‌ఫోన్ హస్తభూషణంగా మారింది. సెల్‌ఫోన్ ప్రాధాన్యత ఎంతలా పెరిగినా.. ఇప్పటికీ కొందరు గ్రంథాలయాల్లోని పుస్తకాలతో విజ్ఞానాన్ని పొందుతున్నారు. కవులు, రచయితలు రచించిన కథలు, నవలలు, కవితలు, కథానికలు చదువుతూ పుస్తక అభిలాషను చాటుతున్నారు.

కథలు..నవలలు

పుస్తకం మానసిక ఆరోగ్యానికి దోహదం చేయడమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తుంది.



లైబ్రరీలోని ప్రముఖ రచయితల కథలు, నవలలు, రచనలు

మనిషి జీవితంలో జరిగే సంఘటనలు, మానవతా విలువలు, సామాజిక సమస్యలు, సంప్రదాయాలు, సంస్కృతులు, అనుబంధాలు, ఆధ్యాత్మికత ఇలా చెప్పుకుంటూ పోతే పుస్తకం ద్వారా పొందలేని జ్ఞానమంటూ లేదని చెప్పాలి. ఇన్ని వస్తువులను తనలో ఇముడుచుకున్న పుస్తకం. ఎంతోమంది కథకులు, రచయితలు, కవులను అక్కున చేర్చుకుంది. కందుకూరి వీరేశలింగం, అడవి బాపిరాజు, దాశరథి రంగాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, గురజాడ అప్పారావు, యద్దనపూడి సులోచనారాణి, మాలతి చందూర్, యండమూరి వీరేంద్రనాథ్, సామల సదాశివ వంటి ఎంతోమంది రచయితల పుస్తకాలకు ఇప్పటికీ ప్రజాదరణ ఉంది. లైబ్రరీ నుంచి ఇప్పటికి ఎంతోమంది పాఠకులు వీరి పుస్తకాలను చదువుతున్నారు.

సామల 'యాది'ఎంతో ఇష్టం



సెల్‌ఫోన్ వాడకం వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. మొబైల్ వాడకం కన్నా పుస్తకాల వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. నేను ఎక్కువగా పుస్తకాలకే ప్రాధాన్యత నిస్తాను. 25 ఏళ్లుగా గ్రంథాలయానికి వస్తున్నాను. గురజాడ అప్పారావు, సామల సదాశివ రచనలను ఇష్టంగా చదువుతాను. సామల రచించిన యాది నాకు ఎంతో ఇష్టమైన గ్రంథం.ఆయన పుస్తకంలో తెలుగు భాష ఎంతో వినసొంపుగా, మనసుకు హత్తుకునేలా ఉంటుంది.

– జి.ఆదినారాయణ, పాఠకుడు, కోలిపురా, ఆదిలాబాద్

పుస్తకాలు చదవడం అలవాటు



పుస్తకాలు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. పుస్తకం చదవడం వల్ల మానసికంగా ఆనందంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి. కథలు, కవితలను చదివితే ఆసక్తి ఎంతగానో పెరుగుతుంది. ప్రతీ విషయంపై ఏకాగ్రత కుదురుతుంది. చిన్ననాటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాను.

– రాజేశ్వర్, పాఠకుడు, నేతాజీ చౌక్, ఆదిలాబాద్

కథల పుస్తకాలు ఆసక్తి



రెండేళ్లుగా లైబ్రరీకి వస్తున్నాను. చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు. కథలు పుస్తకాలు చదవడానికి ఇష్టపడతాను. కథలంటే అమితాసక్తి. ఇంటికి ఈ పుస్తకాలు తీసుకువెళ్తాను.

– శృతి, ఖానాపూర్, ఆదిలాబాద్

కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను..



రెండేళ్లుగా గ్రంథాలయానికి వస్తున్నాను. ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడమే నా లక్ష్యం. డీఎస్సీ కోసం శ్రమిస్తున్నాను. ఓవైపు పోటీ పరీక్ష కోసం సన్నద్ధమవుతూనే, పలు సందర్భాల్లో గ్రంథాలయంలోని పలు కథలు, సాహిత్యం, కవిత్వం వంటి పుస్తకాలు చదివే ప్రయత్నం చేస్తున్నాను. ఈ పుస్తకాలను చదవడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను.

– కీర్తి, పాఠకురాలు, న్యూ హౌసింగ్‌బోర్డ్, ఆదిలాబాద్

పాఠకుల అభిరుచులకు అనుగుణంగా..



జిల్లా కేంద్రంలో 8500 మంది పాఠకుల మెంబర్‌షిప్ ఉంది. ప్రతీనెల 15 నుంచి 20 మంది పుస్తకాలు తీసుకువెళ్తారు. ప్రస్తుతం కాంపిటేటివ్ ఎగ్జామ్స్ వల్ల ఈ పుస్తకాలకే డిమాండ్ ఎక్కువగా ఉంది. పాత పాఠకులు కథలు, నవలలు వంటి పాత పుస్తకాలు తీసుకువెళ్తారు. పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం.

– శ్రీనివాస్, లైబ్రేరియన్, జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఆదిలాబాద్

అంతర్రాష్ట్ర ఇసుక ముఠా అరెస్టు

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడి
- ఏడుగురిపై ఇసుక దొంగతనం కేసు
- రెండు లారీలు సీజ్



పట్టుబడిన లారీలతో డీఎస్పీ జీవన్‌రెడ్డి

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామం వద్ద అంతర్రాష్ట్ర ఇసుక ముఠాను శనివారం అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. భీంపూర్ పోలీసుస్టేషన్‌లో ఈమేరకు వివరాలు వెల్లడించారు. భీంపూర్ మండలంలోని తాంసి(కె), గొల్లఘాట్ గ్రామాల శివారులో పెన్‌గంగ నుంచి ఇసుకను లారీల్లో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తుంది. తాంసి(కె) శివారులో పెన్‌గంగ నుంచి మహారాష్ట్రకు రాత్రిసమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందింది. జైనథ్ సీఐ సాయినాథ్, భీంపూర్ ఎస్సై కలీం, సిబ్బందితో కలిసి పిప్పల్‌కోటి వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. రెండు లారీల్లో అక్రమంగా ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. లారీలో ఉన్న పూసద్‌కు చెందిన నలుగురు డ్రైవర్లు, క్లీనర్లు మోసిన్‌ఖాన్, సయ్యద్ అక్తర్ అలీ, ఉమర్ ఫారుఖ్, విట్టల్ కాడ్సే, తాంసి(కె) గ్రామానికి చెందిన ముక్రా భూమన్న, సంతోశ్, బక్కి ప్రవీణ్‌పై జిల్లాలో మొదటిసారిగా ఇసుక దొంగతనం కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇసుక లారీలను చాకచాక్యంగా పట్టుకున్న జైనథ్ సీఐ, భీంపూర్ ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ



పోలీసులు అనుమానిస్తున్న నిందితుడు

ఆదిలాబాద్‌టౌన్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన ఘటన జిల్లాకేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన చెట్లవార్ మౌనిక తన కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు మధ్యాహ్న సమయంలో పాఠశాలకు వెళ్లింది. తాటిగూడలోని శిశుమందిర్ గేటు తీసేందుకు ప్రయత్నించగా ఆమెకు సాయం చేస్తున్నట్లుగా నటించి ఆమె మెడలో రెండు తులాల పుస్తెల తాడును లాక్కుని పరారయ్యాడు. శుక్రవారం రెక్కీ నిర్వహించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. లూనాపై వచ్చిన దుండగుడు ఆమెను వెంబడించాడు. ముఖం కనిపించకుండా మాస్కు ధరించాడు. దుండగుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లికి చెందిన షేక్ హుస్సేన్(58) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..షేక్ హుస్సేన్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. కుటుంబీకులు శనివారం లేచి చూసేసరికి హుస్సేన్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. వారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మన్మద్‌లో ఒకరు..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో మహారాష్ట్రలోని పిప్పల్‌గాం గ్రామానికి చెందిన దబ్బేకర్ బీరప్ప(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. బీరప్ప అక్కబావ నాగరిబాయి, మల్లయ్యలు మన్మద్‌లో ఓ రైతు వద్ద పాలేరుగా పని చేస్తున్నారు. బీరప్పకు నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామానికి చెందిన లక్ష్మితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఆమె కందకుర్తిలోని పుట్టింటికి వెళ్లింది. భర్త శుక్రవారం కందకుర్తికి వెళ్లి లక్ష్మిని కాపురానికి రావాలని కోరగా నిరాకరించింది. దీంతో మనస్తాపానికి చెందిన ఆయన అదేరోజు రాత్రి మన్మద్ గ్రామంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎనిమిది కాళ్లతో గొర్రెపిల్ల జననం



కుభీర్: మండల కేంద్రంలో బాలకిషన్‌కు చెందిన గొర్రె శనివారం ఎనిమిది కాళ్లతో గొర్రెపిల్లకు జన్మనిచ్చింది. గొర్రెపిల్ల కడుపులో చనిపోయింది. జన్యుపరమైన లోపంతోనే జరిగిందని పశువైద్యాధికారి విశ్వజిత్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

భైంసాటౌన్: ధర్మాబాద్ నుంచి తరలిస్తుండగా పట్టణంలో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు శనివారం వేలం నిర్వహించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బహిరంగ వేలం నిర్వహించగా, ధర్మాబాద్‌కు చెందిన మహబూబ్ ఆలం 360 క్వింటాళ్ల బియ్యాన్ని కిలో రూ.31 చొప్పున దక్కించుకున్నాడు. దీంతో ప్రభుత్వానికి రూ.11.16 లక్షల ఆదాయం చేకూరింది. పట్టణ ఎస్సై శ్రీనివాస్‌యాదవ్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రకాశ్, ఆర్‌ఐ జయరావు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బాపురావు, తదితరులున్నారు.

వేలాల జాతర ఏర్పాట్ల పరిశీలన

జైపూర్: మండలంలోని వేలాలలో ఈ నెల 26నుంచి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే జాతర ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ శనివారం పరిశీలించారు. గుట్టపైన తొలి రోజున జరిగే జతరకు వచ్చే భక్తులు, కల్పించిన సౌకర్యాలు, రెండో రోజు గుట్ట కింద ఆలయం వద్ద భక్తులకు కల్పించే సౌకర్యాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, గోదావరి నది ఒడ్డున భక్తుల పుణ్యస్నానాలు ఆచరించడానికి ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీధర్, వేలాల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురి రిమాండ్

- వివరాలు వెల్లడించిన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల

ఆదిలాబాద్‌టౌన్: మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలు శనివారం వెల్లడించారు. పట్టణంలో మైనర్ బాలికను శుక్రవారం ముగ్గురు నిందితులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన తెలియడంతో జిల్లా పోలీసులు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా వెంటనే నిందితులపై పోక్సోతోపాటు వివిధ సెక్షన్ల కింద పలు కేసులు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఇంగోలే అనిల్, ఇంగోలే గంగాధర్, దుప్పాత్రే సుష్మలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి జైలుకు పంపించారు. కేసుకు సంబంధించి దర్యాప్తు నిష్పక్షపాతంగా తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ గుమికూడి ఉండకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పట్టణంలో గస్తీ, పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. కాగా, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శుక్రవారం రాత్రి పరామర్శించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వదంతులు, పుకార్లు వ్యాప్తి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



మన్మద్‌లోని గోదాం వద్ద రైతులు



కౌంటర్ వద్ద వేచి చూస్తున్న రైతులు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్‌లో లోకేశ్వరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూరియా గోదాం వద్ద శనివారం గ్రామాల రైతులు బారులు తీశారు. మొక్కజొన్న, వరి, నువ్వు పంటలకు యూరియా అవసరం ఉండడంతో రాజూర, మన్మద్, ఎడ్దూర్, పోట్‌పల్లి, హవర్గ గ్రామాల రైతులు ఉదయం కౌంటర్ వద్ద క్యూ కట్టారు. గోదాంకు కేవలం 450 యూరియా బస్తాలు రావడంతో సిబ్బంది ఒక పట్టాదారు రైతులకు 5 బస్తాల చొప్పున పంపిణీ చేస్తామని చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి నిరీక్షించిన కొందరికి 5 యూరియా బస్తాలు దొరికాయి. మరికొందరికి దొరకపోవడంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని సిబ్బంది ఉన్నతాధికారులతో మాట్లాడారు. మళ్లీ యూరియా లోడ్ వస్తుందని చెప్పగానే రైతులు వెనుదిగి వెళ్లిపోయారు.

సమాజ సుస్థిరతకు యువత తోడ్పడాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు


- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ..
- ట్రిపుల్ ఐటీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ

బాసర: సమాజ సుస్థిరతకు యువత తోడ్పాటు అందించాలని నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్డీజీఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యక్రమాన్ని ఎ.గోవర్ధన్, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓయస్డీ) ప్రొఫెసర్ ఇ.మురళీదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏవో రణధీర్ సాగి, ఇతర అధికారుల సమక్షంలో అధికారికంగా ప్రారంభించారు. 17 ఎస్డీజీల ముఖ్య ఉద్దేశం స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం, అందరికీ మెరుగైన భవిష్యత్తును నిర్ధారించడం అని గోవర్ధన్ తెలిపారు. ఆర్జీయూకేటీ విద్యార్థులు 17 అంశాల్లో 10 అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. పేదరిక నిర్మూలన, స్థిరమైన వ్యవసాయం, ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య సమగ్ర సమాన విద్యను అందించడానికి తగిన ఆలోచనలు చేయాలని సూచించారు. స్థిరమైన మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వాతావరణ మార్పు దాని ప్రభావాలను పరిష్కరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఆర్జీయూకేటీ స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి 17 ఎస్డీజీలను సాధించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరాం వ్యాఖ్యలపై ఖండన



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

మంచిర్యాలటౌన్: ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇస్తామని ప్రొఫెసర్ కోదండరాం వ్యాఖ్యానించడాన్ని మంచిర్యాల జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్య వ్యవస్థలో నకిలీలను ప్రోత్సహించే విధంగా కోదండరాం మాటలు ఉండడం శోచనీయమని అన్నారు. ఇప్పటికే కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అధిక మోతాదులో స్టెరాయిడ్, యాంటీబయాటిక్స్, నొప్పి మందులను వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ఎలా నాశనం చేస్తున్నారో చూస్తున్నామని అన్నారు. ఎంబీబీఎస్ డాక్టర్ ప్రాక్టీస్ చేయాలంటే దాదాపు ఐదున్నరేళ్లు కష్టపడాలని, అలాంటి కష్టమైన సబ్జెక్ట్‌ని రెండు మూడు నెలల శిక్షణతో ఎలా చేయగలరని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, సెక్రెటరీ డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చంద్రదత్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ధాన్యం బస్తాలు దగ్ధం



మంటలార్పుతున్న భైంసా అగ్నిమాపక సిబ్బంది

లోకేశ్వరం: మండలంలోని రాయాపూర్‌కాండ్లీ శివారు ప్రాంతంలోని శ్రీసాయి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా గోదాం నుంచి పొగతో కూడిన మంటలు వచ్చాయి. గోదాంలో ఖాళీ గోనె సంచులు, ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. సిబ్బంది వెంటనే భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. గోదాంలో రూ.10 లక్షల విలువ చేసే ఖాళీ సంచులు, రూ.5 లక్షల విలువ చేసే ధాన్యం బస్తాలు అగ్నికి ఆహుతైనట్లు యజమాని కోస్లి వెంకట్‌రావు తెలిపారు.

సెక్యూరిటీగార్డుపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారు ప్రాంతంలో జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న దాబా వెనుకలో ల్యాండ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు శనివారం దాడి చేశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది కార్తీక్‌సింగ్, విఠల్ అక్కడికి చేరుకుని గాయపడిన విజయ్‌కుమార్‌ను రిమ్స్‌కు తరలించారు.